తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460



https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
23 జులై 2026
సంపుటి 03
సంచిక 282
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com




## పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

- ఒక్క దాంటలో కూడా దోషులను తేల్చలేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ,జూలై22తరంగాలు : గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన

మిగతా 2వ పేజిలో..

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

- ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు
- సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ
- పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు
- గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు



న్యూఢిల్లీ,జూలై22తరంగాలు : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. ఈరోజు(బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి,

మిగతా 2వ పేజిలో..




## రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

- 'ఎల్ నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ
- వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్
- 2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్'
- అప్పల రీస్ట్రక్చరింగ్‌తో డిస్కంలను నంబర్-1గా తీర్చిదిద్దే ప్రణాళికలు
- ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

## తెలంగాణకు కేంద్రం శుభవార్త

- 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలుకు ఆమోదం

హైదరాబాద్,జులై22తరంగాలు : తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం భుభవార్త తెలిపింది.రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని

మిగతా 2వ పేజిలో..




## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పొంగులేటి

హైదరాబాద్,జూలై22తరంగాలు : పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో

మిగతా 2వ పేజిలో..

## రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్

- సోదాల్లో భారీగా ఆస్తులు గుర్తించిన ఎసిబి

హైదరాబాద్,జూలై22తరంగాలు : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సోదాల అనంతరం ఆస్తులను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించారు. మాదాపూర్‌లోని డీఈ ఇల్లు సహా 8 ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సోదాలు చేశారు. ఆయనకు

మిగతా 2వ పేజిలో..

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

- కొడంగ్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్




వికారాబాద్,జూలై22 తరంగాలు : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కొడంగల్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేందప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో

మిగతా 2వ పేజిలో..

## సిసిఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ



హైదరాబాద్,జూలై 22 తరంగాలు : ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై

మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం, 23 జూలై, 2026


## కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు.అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా రాహుల్ గాంధీ చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.ఖ. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అఃఃఆలో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

హన్మకొండ,జూలై22 కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పొంగులేటి తెలిపారు.

## పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బ్జడెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి - కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి - కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.

## తల్లికి వందనంతో పిల్లలకు భరోసా

42,70,842 మంది తల్లుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ

టిడిపి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వెల్లడి

అమరావతి,జూలై22 తల్లికి వందనంతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్ సారథ్యంలో తల్లుల ఖాతాల్లో బుధవారం తల్లికి వందనం నిధులు జమ అవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 67,47,190 మంది విద్యార్థులకు రూ.10,120 కోట్ల ఆర్థిక సాయం చేశామని ఆయన వివరించారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా 42,70,842 మంది తల్లుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేశామని చెప్పారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి నగదు ఇస్తామన్న చెప్పిన హామీని అమలు చేసి చూపించామని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు స్పష్టం చేశారు. అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి గతంలో తల్లులను మోసం చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. ఒక్క

బిడ్డకే పరిమితం చేసి 25 లక్షల మందికి అమ్మ ఒడిని గొడ్డలి పార్టీ ఎగ్గొట్టిందని విమర్శించారు. 2023-24లో కేవలం కొంత మందికే ఇచ్చి పిల్లల కడుపు కొట్టిరంటూ వైఎస్ జగన్ వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. నేడు కూటమి ప్రభుత్వంలో అదనంగా 17,000 మంది అంగన్‌వాడీల పిల్లలకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామని ఆయన గుర్తు చేశారు.

## సిసిఐ పునరుద్ధరణపై మీ వైఖరి ఏంటి

ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ఎ÷-లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.

## రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు

హన్మకొండ,జూలై22 :'ఎల్ నినో' ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై తీవ్రమైన షాక్ లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు. అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందుచూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగు తున్నామన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనేదే లేదని, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, లైన్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. 'ప్రజా బాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు. గతంలో ఎక్కువ వడ్డీలతో తెచ్చిన పాత రుణాలను 'రీస్ట్రక్చరింగ్' చేయడం ద్వారా సంస్థల రుణభారం తగ్గించి, డిస్కంలను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. గతంలో వైద్యారోగ్య శాఖలో 108 అంబ్యులెన్స్ సేవలు తీసుకొచ్చిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతో పాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఈ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర్1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు (ంఎ) సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి, ఆటోమేటిక్‌గా క్షణాల్లో సమాచారాన్ని అంబ్యులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని... మెసేజ్ ఆధారంగా అంబ్యులెన్స్ నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరిస్తుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ... విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ. 1.20 కోట్లు బీమా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. అలాగే లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందించినట్లు పేర్కొన్నారు. మరోవైపు 'గృహజ్యోతి' పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కం కంపెనీలకు చెల్లిస్తోందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అయ్యే ?రూ. 14,000 కోట్ల సబ్సిడీ నిధులను? కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.

## తెలంగాణకు కేంద్రం శుభవార్త

కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

## రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో నాలుగు ప్లాట్లు, కూకట్‌పల్లిలో మూడంతస్తుల వాణిజ్య భవనం, గుట్టల బేగంపేటలో ఐదంతస్తుల భవనం ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో 2.09 కిలోల బంగారం, 3 కార్లు, బ్యాంకు ఖాతాల్లో రూ.52.02 లక్షలున్నట్లు తేలింది. ఆయన భార్య పేరుపై నాలుగు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ఉన్నట్లు గుర్తించారు. ఆ సంస్థలు 10 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో 4 ప్లాట్లు, అంజనేయనగర్‌లో జీ ప్లస్-3 కమర్షియల్ భవనం, గుత్తాల బేగంపేట్‌లో జీ ప్లస్-5 కమర్షియల్ భవనాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఆయన భార్య పేరుతో నమోదైన నాలుగు నిర్మాణ సంస్థల ద్వారా భారీ పెట్టుబడులు పెట్టినట్లు దర్యాప్తులో తేలిందని ఏసీబీ వెల్లడించింది. అంజనేయనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో 10 అపార్ట్‌మెంట్లు నిర్మించినట్లు, వాటి నిర్మాణ విలువ సుమారు రూ.20 కోట్లుగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. సోదాల్లో బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.52.02 లక్షల నగదుతో పాటు 2,094 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. కియా, మహీంద్రా, బలెనో కార్లు సహా మూడు వాహనాలు, సుమారు రూ.30 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, 19 విదేశీ మద్యం సీసాలు, ఒక ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వెంకట రమణ 2019లో రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ ట్రాప్‌లో చిక్కుకున్నారని, ఆ కేసులో ఇప్పటికే ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. అప్పట్లో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం విలువను కూడా కలుపుకుంటే ఆయనకు సంబంధించిన మొత్తం అక్రమ ఆస్తుల విలువ రూ.28.14 కోట్లకు చేరిందని ఏసీబీ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనను కోర్టులో హాజరుపరిచి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

జాతీయ దిన పత్రిక

తరంగాలు

## రహదారులను ఉద్దేశపూర్వకంగా లేదా నిర్లక్ష్యంగా దెబ్బతీయడం చట్టరీత్యా నేరం

• ఎస్సై పి.సంధ్య



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఏన్కూర్ మండలం, టి.ఎల్.పేట గ్రామ ప్రధాన రహదారిపై ట్రాక్టర్‌కు ఫుల్ వీల్స్ (ఇనుప చక్రాలు) అమర్చి నడపడం వల్ల రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించబడింది. ఈ ఘటనకు సంబంధించి టి.ఎల్.పేట గ్రామానికి చెందిన కూచిపూడి నరసింహారావు పై ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినందుకు సంబంధిత చట్టాల ప్రకారం ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సంధ్య కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లకు లేదా ఇతర వాహనాలకు ఫుల్ వీల్స్/ఇనుప చక్రాలు అమర్చి సీసీ రోడ్లపై నడపడం వల్ల రహదారులు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా ప్రజా ధనం వృథా కావడంతో పాటు రహదారులపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల ఎవరైనా ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలకు ఫుల్ వీల్స్ అమర్చి రహదారులపై నడిపి ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినట్లయితే, వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై అన్నారు.

## పేపర్ లీకేజీలను అరికట్టలేని చేతగాని బిజెపి ప్రభుత్వం

• న్యాయం కోరిన విద్యార్థి-యువతపై లాఠీ-చార్జ్ అమానుషం
• ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు 100కు పైగా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకుని లక్షలాది మంది విద్యార్థుల, యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు న్యాయం కోరుతున్న విద్యార్థి, యువతపై దమనకాండకు పాల్పడుతోందని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ తీవ్రంగా విమర్శించారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై న్యాయ విచారణ జరిపి,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలోని విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని సాయికుమార్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో దేశంలో ఎక్కడ విద్యార్థులకు, యువతకు అన్యాయం జరిగినా అక్కడ యువజన కాంగ్రెస్ ముందుండి పోరాటం చేస్తుందని,ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వేజెండ్ల సాయికుమార్ స్పష్టం చేశారు.

## ట్యాంక్ బండ్ పరిశీలనలో కమిషనర్ వెంకన్న

• బొందివాగు నాలా విస్తరణ, కొత్త షట్టర్ల నిర్మాణంతోనే ముంపునకు చెక్
• భద్రకాళి మత్తడి ద్వారానే నీటి తరలింపు జరగాలని వినతి
• క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, శాశ్వత పరిష్కారంపై కమిషనర్ హామీ



**వరంగల్ ప్రతినిధి, జులై 22,తరంగాలు :** వరంగల్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ వెంకన్న బుధవారం ఉదయం భద్రకాళి ట్యాంక్ బండ్ ను సందర్శించారు. ట్యాంక్ బండ్ పై జరుగుతున్న అభివృద్ధి పనులు, సుందరీకరణను ఆయన పరిశీలిస్తున్న క్రమంలో... పరిసర కాలనీల వాసులు ఆయనను కలిసి తమ దీర్ఘకాలిక సమస్యలను విన్నవించుకున్నారు. ముఖ్యంగా ప్రతి వర్షాకాలంలో తాము ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

### ఒక్కటే పరిష్కారం.. అదే శరణ్యం

ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. బొంది వాగు నాలాను తక్షణమే విస్తరించి, ఇరువైపులా పటిష్టమైన రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. వర్షపు నీరు కాలనీల్లో నిలవకుండా సాఫీగా వెళ్లేందుకు వీలుగా కొత్తగా షట్టర్లు నిర్మించాలన్నారు. ఈ నీరు నేరుగా భద్రకాళి రిజర్వాయర్ కు చేరుకుని, అక్కడి నుంచి మత్తడి ద్వారా బయటకు వెళ్లేలా వ్యవస్థను తీసుకురావాలని కోరారు. భద్రకాళి పరిసర ప్రాంతాలను వరద బారి నుంచి కాపాడేందుకు ఇంతకు మించి వేరే ప్రత్యామ్నాయ శాశ్వత పరిష్కారం లేదని వారు కమిషనర్ కు తేటతెల్లంగా వివరించారు.

### సానుకూలంగా స్పందించిన కమిషనర్

కాలనీవాసుల విజ్ఞప్తిపై కమిషనర్ వెంకన్న సానుకూలంగా స్పందించారు. వారు చెప్పిన సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన.. వెంటనే స్థానికులతో కలిసి ఆ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారుల బృందంతో కలిసి పరిస్థితిని అంచనా వేశారు. అతి త్వరలోనే ఇరిగేషన్, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, ఉమ్మడి సమీక్ష నిర్వహించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన కాలనీవాసులకు స్పష్టమైన హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు మల్లెల సిద్ధిరాములు, బొట్టు సురేష్, గోడిశాల పాండు, దేవులపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనం





• తుంబూరు దయాకర్ రెడ్డి
• విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో కేంద్రప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపాటు
• కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని మోదీ తక్షణమే రాజీనామా చేయాలని
• డిమాండ్ ఏదులాపురంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఏదులాపురం మున్సిపాలిటీ : పోటీ పరీక్షల లీకేజీలతో దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల, నిరుద్యోగ యువత జీవితాలను నాశనం చేస్తూ,వారి తరఫున ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణపురం రాంలీలా ఫంక్షన్ హాల్ నుండి ప్రధాన వీధుల గుండా ప్రదర్శనగా వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... పేపర్ లీకేజీల వల్ల కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుంటే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని ఆందోళన చేసిన రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగానికి దిగడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ప్రధాని నరేంద్ర మోదీ,విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పట్టుబట్టారు. అరెస్టులకు, అక్రమ కేసులకు కాంగ్రెస్ శ్రేణులు భయపడేది లేదని, విద్యార్థులు,నిరుద్యోగుల హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఖమ్మం రూరల్ మండల, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి





• రాష్ట్రవ్యవసాయ,మార్కెటింగ్,సహకార,చేనేత,జౌళీ శాఖల మంత్రి తుమ్మల
• వచ్చే జూన్ వరకు త్రాగునీటికి సరిపడా నీటి వినియోగంపై కార్యాచరణ సిద్ధం
• రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం కొనసాగుతోంది
• వరి, మిర్చికి బదులుగా ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి
• రూ.175 లక్షల యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు,కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్,చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగుపై పట్టుబడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. 1977లో వచ్చిన కరువు కంటే ప్రస్తుతం వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న సూపర్ ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమై ఉండే అవకాశముందని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీని ప్రభావం పెరిగి భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని, త్రాగునీటి పరిరక్షణపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో 'సీతారామ'ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు. ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. మంచుకొండతో పాటు ఇతర ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా చెరువులు నింపి, మంచుకొండ ఓవర్‌ఫ్లోను మున్నేరులోకి మళ్లించడం ద్వారా ఖమ్మం నగర త్రాగునీటి అవసరాలను తీర్చేప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అవసరమైతే డీప్‌కట్ నుంచి మంచుకొండకు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించే అత్యవసర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు.పశ్చిమాసియా యుద్ధాల ప్రభావంతో బొగ్గు, గ్యాస్ కొరత ఏర్పడి విద్యుత్ సరఫరా, యూరియా ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతులకు పారదర్శకంగా యూరియా అందించేందుకు ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఇది పూర్తిగా రైతుల సంక్షేమం కోసమేనని చెప్పారు. రాజకీయ ప్రేరేపణలను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు. ఖమ్మం నగరంలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, విద్యుత్ స్తంభాల సమీపంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.
జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగిస్తూ వచ్చే జూన్-2027 వరకు త్రాగునీటి అవసరాలు తీరేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటి వరకు గోదావరి జలాలను వైరాకు తరలించామని, ప్రస్తుతం రాజీవ్ కాలువ షట్టర్లను మూసివేసి గోదావరి నీటిని తిరిగి ఖమ్మం వైపు మళ్లించి పాలేరు రిజర్వాయర్ ను నింపే అవకాశాలను ఇంజినీర్లు, నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా త్రాగునీటి సమస్యను అధిగమించగలమనే విశ్వాసం ఉందన్నారు. అయితే వర్షాలు లేకుంటే వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగు కష్టసాధ్యమవుతుందని హెచ్చరించారు. నీరు కనిపిస్తున్నదని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇర్రిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం తాగునీటిపై మండల స్థాయి సమీక్ష సమావేశం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి జూలై 22 తరంగాలు**
వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,వి ఈ జి ఆర్ ఏ ఎం జి డ్రైయిన్ ఉ సోక్ పిట్స్,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి,పురోగతి నివేదికలను అత్యవసర ప్రాధాన్యతతో సమర్పించాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, ఏఈ పీఆర్ జి. సందీప్ రెడ్డి,ఏఈ ఆర్.డబ్ల్యు.యస్ శ్రీకీర్తి, ఈజీఎస్ ఈసీ బీపీ విక్రమ్,ఏఈ హౌసింగ్ కిరణ్,ఆయా గ్రామల పంచాయతీ కార్యదర్శులు,సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• సర్పంచ్ కుల్ల మోహన్ రావు



**జఫర్గఢ్ ప్రతినిధి, జూలై 22,(తరంగాలు:** ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి . బుధవారం రోజున మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సిహెచ్సీలో సర్పంచ్ కుల్ల మోహన్ రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం శస్త్ర నిమిత్తం హైదరాబాద్కు తీసుకెళ్లడం జరుగుతుందని సర్పంచ్ మోహన్ రావు తెలియజేశారు.గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్వాల కుమార్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి

• ఏఈఓ సాయి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి జూలై 22, తరంగాలు: వలిగొండ మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపాలని ఏఈఓ సాయి రైతులకు తెలిపారు. వానకాల ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రత్యేక సదస్సులో సూచించారు. కేంద్ర వ్యవసాయ, వాతావరణ శాఖ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రణాళికను రూపొందించడం జరిగిందని, ఎల్ నినో ప్రభావంతో ఈ వానాకాలం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుందని, భూగర్భ జలాలు అడుగంటుపోయే ప్రమాదం ఉందని తద్వారా తక్కువ నీటితో సాగయ్యే అధిక దిగుబడి నిచ్చే పంటలను సాగు చేయాలని సూచించడం జరిగినది. ముఖ్యంగా అధిక నీటితో పండే వరి పంటను తగ్గించి ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము, నువ్వులు, రాగి, జొన్న, సజ్జ వంటి తొందరగా చేతికొచ్చే పంటలను తక్కువ నీటితో పండించుకోవచ్చనీ వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసంపల్లి మచ్చ గిరి ఆటో నెంబర్ల గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధి అకాలేషియా కార్డియా కు యశోద హాస్పిటల్ వైద్యుల చికిత్స




**నల్లగొండ- జూలై 22, తరంగాలు :** అకాలేషియా కార్డియా వ్యాధికి అత్యాధునిక పోయెమ్ టెక్నిక్ ద్వారా విజయవంతంగా చికిత్స అందించినట్లు మలక్ పేట్ యశోదా వైద్య నిపుణులు డాక్టర్ కిషన్ తెలిపారు బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు 52 ఏళ్ల సుల్తానా మహిళ గత 10 సంవత్సరాలుగా ఆహారం మింగడంలో తీవ్ర ఇబ్బంది, ఛాతీ నొప్పి, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. పలు పరీక్షల అనంతరం ఆమెకు అక్యలేషియా కార్డియా ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ సమస్యకు పరిష్కారంగా యశోదా ఆస్పత్రి గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం వైద్యులు పోయెమ్ అనే నూతన ఎండోస్కోపిక్ పద్ధతిని ఉపయోగించారు. ఈ పద్ధతిలో శరీరంపై ఎలాంటి కోత ఉండదు. నోటి ద్వారా ఎండోస్కోప్ సహాయంతో అన్నవాహిక కండరాలను సరిచేస్తారు. ఆస్పత్రి వర్గాల ప్రకారం, ఈ చికిత్స వల్ల రోగికి నొప్పి తక్కువగా ఉంటుంది. ఇన్ఫెక్షన్ ప్రమాదం కూడా తక్కువ. రోగి 2 నుండి 3 రోజుల్లోనే డిశ్చార్జ్ అయి సాధారణ ఆహారం తీసుకోవచ్చు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. ఆహారం మింగడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి, వాంతులు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే యశోదా ఆస్పత్రుల సంప్రదించాలని సూచించారు. హాస్పటల్ సిబ్బంది లక్ష్మణ్, ఏనుగు వాసు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో ఐబీఎం ఆధ్వర్యంలో 'ఏఐ టూల్స్ అండ్ అప్లికేషన్స్' వర్క్‌షాప్




**ఖమ్మం ప్రతినిధి, జూలై 22,తరంగాలు :** పాన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్, ఖమ్మంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐబీమ్ స్కిల్సబిల్డ్ ప్రోగ్రాం సహకారంతో "ఏఐ టూల్స్ అండ్ అప్లికేషన్స్ " అంశంపై 4 రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ )లో వస్తున్న తాజా పరిణామాలు, పరిశ్రమల్లో ఏఐ వినియోగం, జనరేటివ్ ఏఐ , ప్రాంప్ట్ ఇంజనీరింగ్ , ఏఐ ఆధారిత కెరీర్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించడం కోసం వర్క్షాప్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ ఐ బి మ్ స్కిల్స్ తెలంగాణ హెడ్ ,రాఘవేంద్ర గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని, ఏఐ వంటి ఆధునిక సాంకేతికతల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి అని కృత్రిమ మేధస్సు భవిష్యత్తు ప్రపంచాన్ని నిర్దేశించే సాంకేతికతగా రూపుదిద్దుకుంటోందని, విద్యార్థులు ఏఐ ఆధారిత నైపుణ్యాలను అలవర్చుకుని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఐబీమ్ స్కిల్సబిల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాది వేస్తున్నాయి అని, ఇటువంటి పరిశ్రమ ఆధారిత శిక్షణా కార్యక్రమాలను ఎంపిక చేసిన కళాశాలలో నిరంతరం నిర్వహిస్తాం అని తెలిపారు. కళాశాల డైరెక్టర్ శ్రీ విద్య మాట్లాడుతూ, నేటి ఉద్యోగ ప్రపంచంలో డిగ్రీతో పాటు నైపుణ్యాల పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది అని ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పొందుతారు అని పేర్కొన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, "విద్యార్థులు ఐబీమ్ స్కిల్సబిల్డ్ అందించే కోర్సులు, సర్టిఫికేషన్లు మరియు డిజిటల్ క్రెడెన్షియల్స్‌ను సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకోవాలి. భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధమయ్యేలా శ్రీ చైతన్య ఎల్లప్పుడూ ఉత్తమ అవకాశాలను కల్పిస్తూనే ఉంటుంది అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో అందించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అభ్యసించి, ఏఐ సాంకేతికతను విద్య, పరిశోధన మరియు ఆవిష్కరణలలో సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం మరియు ఆవిష్కరణాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరవేయడానికి సంస్థ నిరంతరం వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ మరియు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.





THARANGALU DAILY NEWS
గురువారం, 23 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# భారత వ్యవసాయ రంగం

# బహుళజాతి కంపెనీలకు అమ్మకానికి లేదు



**జఫర్గడ్ ప్రతినిధి, జులై 22,(తరంగాలు):** అఖిల భారత కిసాన్ సభ , సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీల పిలుపు మేరకు, భారత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల' కు వ్యతిరేకంగా బుధవారం జనగామ జిల్లా వ్యాప్తంగా రైతాంగం కదం తొక్కింది. భారత వ్యవసాయ రంగం అమ్మకానికి సిద్ధంగా లేదు అనే నినాదంతో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జఫర్ ఘడ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కార్యదర్శి నక్క యాకయ్య అధ్యక్షత వహించగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ రైతు సంఘాల నాయకులు కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశభక్తి ముసుగులో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఆచరణలో భారత సార్వభౌమాధికారాన్ని, రైతుల ప్రయోజనాలను అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, న్యూజిలాండ్ వంటి సామ్రాజ్యవాద దేశాలకు తాకట్టు పెడుతోందని తీవ్రంగా విమర్శించారు. విదేశాల్లో భారీ సబ్సిడీలు పొందిన వ్యవసాయ ఉత్పత్తులను మన దేశంలోకి స్వేచ్ఛగా డంప్ చేయడం ద్వారా స్థానిక రైతుల జీవనోపాధిని దెబ్బతీసే భారీ కుట్రకు మోడీ ప్రభుత్వం తెరలేపిందని మండిపడ్డారు. ముఖ్యంగా తెలంగాణ పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఉరితాళ్లు బిగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ పత్తిపై ఉన్న దిగుమతి సుంకాలను ఎత్తివేయడం అంటే, స్వదేశీ రైతుల పొట్ట కొట్టడమేనని ధ్వజమెత్తారు. అలాగే, దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న పాడి పరిశ్రమను బహుళజాతి కంపెనీలకు అప్పగించి, పాలు, పాల ఉత్పత్తుల రైతులను నాశనం చేసే దిశగా అడుగులు వేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ఒప్పందాలతో దేశీయ పంటలకు గిట్టుబాటు ధరలు పడిపోయి, విత్తనాలపై కార్పొరేట్ గుత్తాధిపత్యం పెరిగి, దేశ ఆహార భద్రతకే తీవ్ర ముప్పు వాటిల్లుతుందని వారు హెచ్చరించారు. రైతు సంఘాల ప్రధాన డిమాండ్లు: రైతుల పాలిట మరణశాసనంగా మారుతున్న భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై సంతకం చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, దాని నుండి పూర్తిగా వైదొలగాలి. దేశ ఆహార భద్రత, వ్యవసాయ రంగం, సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ఎలాంటి వాణిజ్య ఒప్పందాలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గకూడదు. విదేశీ పత్తిపై ఎత్తివేసిన దిగుమతి సుంకాలను తక్షణమే పునరుద్ధరించి (యథావిధిగా కొనసాగించి), దేశీయ పత్తి రైతును ఆదుకోవాలి. పాలు, పాల ఉత్పత్తుల రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న దిగుమతి విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, ప్రజా ప్రతినిధులతో విస్తృతంగా చర్చించకుండా ఏకపక్షంగా వ్యవసాయ రంగంపై అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకోరాదు. రైతాంగం అల్టిమేటం - నిరంతర పోరాటాలకు ప్రతిజ్ఞ: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా దేశ వ్యవసాయాన్ని, చిన్న-సన్నకారు రైతులను, వ్యవసాయ కార్మికులను, ఎం యస్ ఎం ఈ లను గాలికి వదిలేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ రోజు మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం. 2020-21 నాటి చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో ఈ దేశ విద్రోహ ఒప్పందాలను అడ్డుకుంటాం. గ్రామ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు ప్రజలను చైతన్యపరుస్తూ, కార్మికులు, ప్రజలతో కలిసి ఐక్య పోరాటాలను బలోపేతం చేస్తాం. ఈ ఒప్పందాలు రద్దయ్యే వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోరైతు సంఘం మండల అధ్యక్షులు రాయపురం బిక్షపతి, మండల నాయకులు తమ్మడపల్లి ఉప సర్పంచ్ గంగరాజు, వేల్పుల రవి,పులిగిల్ల నాగరాజు, నల్ల తీగల శ్రీను, మారపల్లి బాబు,వేల్పుల రమేష్, జల్లెల్ల శ్రీను,ఎర్ర రవి, నీరటి కోటయ్య, వంచో జు నారాయణ, రామస్వామి,కనకయ్య,దాట్ల యాదగిరి, ఇల్లెందుల ఎల్లయ్య, నల్లగట్ల సమ్మయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గీతన్నల చైతన్య యాత్రను విజయవంతం చేయాలి




• చిలువేరు సమ్మయ్య గౌడ్

**కేసముద్రం, జులై 22,తరంగాలు ప్రతినిధి :** అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర (బస్సు)ను విజయవంతం చేయాలని గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ గీత కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర కల్లు గీత కార్మికుల బస్సు యాత్ర పోస్టర్‌ను కేసముద్రంలో గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కేజీకెవిస్ మండల అధ్యక్షులు బబ్బురి ఉప్పలయ్య, మండల కార్యదర్శి మోడం ఉపేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, గీత వృత్తి అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ బస్సు యాత్రను ప్రతి గీత కార్మికుడు తన సొంత కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీరశివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా తెలంగాణ గీత కార్మికుల సంక్షేమ సంఘం ప్రతి ఏడాది రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితర రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్ర మహబూబాబాద్ జిల్లా నుంచి ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 2వ తేదీ ఉదయం 11 గంటలలోపు మహబూబాబాద్‌లోని ఇల్లందు రోడ్డు ఆర్తి గార్డెన్స్ వద్ద రాష్ట్ర బస్సు యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళు లర్పించిన అనంతరం జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి గూడూరు చేరుకుని రాదంత్రి బస చేయనున్నట్లు వివరించారు.

### కేసముద్రం వైపు బస్ యాత్ర

ఆగస్టు 3వ తేదీ ఉదయం గూడూరు నుంచి బయలుదేరిన రాష్ట్ర బస్సు యాత్ర అప్పనపల్లి మీదుగా కేసముద్రం మండలానికి చేరుకుంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికి, అక్కడి నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో కేసముద్రం ప్రధాన వీధుల గుండా మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి,పూలే కీ పూలమాల వేసిన అనంతరం బహిరంగ సభలో రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం రాష్ట్ర బస్సు యాత్రకు ఘనంగా సెండ్‌ఆఫ్ ఇచ్చి, తిమ్మంపేట,ఇనుగుర్తి మీదుగా మద్రిపేట వైపు సాగనంపనున్నట్లు వెల్లడించారు.

### అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలి--లిసమ్మిగౌడ్

గూడూరు నుంచి అప్పనపల్లి మీదుగా కేసముద్రం మండలంలోకి ప్రవేశించే రాష్ట్ర బస్సు యాత్రకు ఉమ్మడి కేసముద్రం మండలం లోని ప్రతి గ్రామం నుంచి కనీసం 50కు పైగా ద్విచక్ర వాహనాలతో బైక్ ర్యాలీగా తరలివచ్చి రాష్ట్ర బస్సు యాత్రను విజయవంతం చేయాలని, గీత కార్మికుల ఐక్యత, ఆత్మ గౌరవం మరియు సంఘటిత శక్తిని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని చిలువేరు సమ్మయ్య గౌడ్ పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బబ్బురు ఉప్పలయ్య,మోడెం వెంకటేశ్వర్లు,మెడి వెంకటేశ్వర్లు పలుస వెంకన్న,ఓరుగంటి వెంకన్న, చింతనూరి వెంకన్న,ఇనుగుర్తి వెంకన్న, రడం వెంకన్న, కదిరా సోమయ్య,జోగు రవీందర్ రాంపల్లి వెంకన్న పాల్గొన్నారు.

# వర్ధన్నపేట కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా దామెర ప్రశాంత్

• ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు నియామక పత్రం అందజేత
•పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న ప్రశాంత్



**వర్ధన్నపేట ప్రతినిధి,జూలై 22, తరంగాలు :** వర్ధన్నపేట కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు దామెర ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం.డి. అయూబ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ దామెర ప్రశాంత్‌కు



నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దామెర ప్రశాంత్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. అయూబ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, ఐనావోలు దేవస్థాన కమిటీ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ , మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుప్రసాద్, జిల్లా నాయకుడు అబ్బిడి రాజిరెడ్డి, మండలంలోని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని దామెర ప్రశాంత్ పేర్కొన్నారు.

# దేవాదాయ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

•ఆక్రమణదారులపై ట్రిబ్యునల్‌లో కేసులు నమోదు చేయాలని సహాయ కమిషనర్ సునీత ఆదేశం



**వరంగల్ ప్రతినిధి, జులై 22,తరంగాలు :** దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, దేవస్థానాల కార్యనిర్వహణాధికారులతో సహాయ కమిషనర్ ఆర్. సునీత బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా దేవాదాయ శాఖకు చెందిన అన్యాక్రాంత భూముల పరిరక్షణ, అర్చకులు విక్రయించిన భూముల వివరాల సేకరణ, సీ .సీ .ఎల్ .ఏ లో గుర్తించిన దేవాదాయ భూములను శాఖ రికార్డుల్లో నమోదు చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. మండల ఇన్‌చార్జిలు తమ పరిధిలోని దేవాదాయ భూములపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, లీజుకు ఇచ్చిన భూముల నుంచి బకాయి లీజు మొత్తాలను పూర్తిగా వసూలు చేయాలని సూచించారు. అలాగే అనధికారికంగా కౌలు సాగు చేస్తున్న వారి నుంచి కౌలు వసూలు చేయాలని, నిబంధనలు పాటించని వారిని ఆక్రమణదారులుగా గుర్తించి ఎండోమెంట్స్ ట్రిబ్యునల్‌లో కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణతో పాటు ఆదాయాన్ని పెంచే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సహాయ కమిషనర్ ఆర్. సునీత స్పష్టం చేశారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలతో రైతాంగానికి తీవ్ర నష్టం

•అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించాలి
•రైతుల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి
•రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో నిరసన రాస్తారోకో




**వరంగల్ ప్రతినిధి, జులై 22,తరంగాలు :** అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలతో దేశీయ వ్యవసాయం దివాలా తీసి రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతారని తక్షణమే ఆ ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, కుసుంబా బాబురావు, రాచర్ల బాలరాజు, చుక్క మొగిలి, సుదమల్ల భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నిరసన రాస్తారోకో చేపట్టి పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దొడ్డిదారిన రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేసేందుకు పథకం ప్రకారం కుట్ర చేస్తున్నదని అందులో భాగంగానే అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో ఒప్పందాలను కుదుర్చుకుంటున్నదని ఈ ఒప్పంద అమలు అయితే దేశంలోని రైతాంగం దివాలా తీయడం ఖాయమని ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన మోడీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అమెరికా లాంటి దేశాల నుంచి పత్తి మొక్కజొన్న సోయాబీన్ పాల ఉత్పత్తులు దిగుమతి చేసుకోవడం ఆందోళనకరమన్నారు. దేశీయ రైతులు అందించిన పంటలకు కనీసం మద్దతు ధర చట్టం చేయకుండా ఉత్పత్తి ఖర్చులు పెంచి సన్నా చిన్నకారు రైతులను వ్యవసాయం నుంచి దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దాసోహం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు విడనాడి అమెరికాతో స్వేచ్ఛ వానిచే ఒప్పందాలను ఉపసంహరించుకొని రైతులకు అనుకూల విధానాలు చేపట్టాలని డిమాండ్ చేశారు లేకపోతే ఢిల్లీ తరహా రైతాంగ ఉద్యమం ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు నర్ర ప్రతాప్ ముక్కెర రామస్వామి మాలోతు సాగర్ సుంచు జగదీశ్వర్ ఓదెల రాజన్న మైదం పాణి అప్పనపురి నర్సయ్య వినోద పూలమ్మ లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.ల

# జూలై 24న పాల్వంచ ఐడీఓసీలో ఫుడ్ లైసెన్స్ మేళా

# తత్కాల్ లైసెన్స్ పేరుతో అదనపు చెల్లింపులు చేయొద్దు

•జిల్లా ఆహార భద్రత అధికారి శరత్

**భద్రాద్రి కొత్తగూడెం, తరంగాలు న్యూస్ జూలై 22:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24న (శుక్రవారం) పాల్వంచ ఐడీఓసీ (×ఙూజ)లో ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార భద్రత అధికారి ఈ. శరత్ తెలిపారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, బేకరీలు, కిరాణా దుకాణాలు, పాలు మరియు పాల ఉత్పత్తుల వ్యాపారులు, ఇతర ఆహార వ్యాపార సంస్థల యజమానులు ఈ మేళాకు హాజరై కొత్త ఫుడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్, లైసెన్స్ పునరుద్ధరణ (రిన్యూవల్), సవరణలు (మోడిఫికేషన్) తదితర సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా "తత్కాల్ ఫుడ్ లైసెన్స్" పేరుతో ఎవరైనా అదనపు రుసుములు కోరితే చెల్లించవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ విధానంలోనే ఫుడ్ లైసెన్స్ పొందవచ్చని స్పష్టం చేశారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఫుడ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకుని అధికారిక విధానంలోనే సేవలు పొందాలని జిల్లా ఆహార భద్రత శాఖ ఆహార వ్యాపారులకు విజ్ఞప్తి చేసింది.

## మై భారత్ పోర్టల్‌లో ప్రతి విద్యార్థి నమోదుయువతకు కేంద్ర అవకాశాలు వినియోగించుకోవాలి: అదనపు కలెక్టర్ వేణుగోపాల్

- మై భారత్ పోర్టల్‌లో ప్రతి విద్యార్థి నమోదు -- యువతకు కేంద్ర అవకాశాలు వినియోగించుకోవాలి




**భద్రాద్రి కొత్తగూడెం, తరంగాలు న్యూస్ జూలై 22:**
జిల్లాలోని ప్రతి విద్యాసంస్థలో చదువుతున్న యువతను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మై భారత్ (వీ దీష్ఘుతీఫ్) పోర్టల్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం సుమారు 9 వేల మంది యువత పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమాల ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు అన్ని విద్యాసంస్థలను సందర్శించి ప్రతి విద్యార్థిని మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయిలో యూత్ పార్లమెంట్ నిర్వహించి ప్రతిభావంతులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయాలని తెలిపారు.వికసిత్ భారత్, నషా ముక్త్ భారత్ కార్యక్రమాల్లో యువతను విస్తృతంగా భాగస్వాములను చేయాలని, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం తదితర ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునే అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## వరకట్న వేధింపుల వల్ల, భార్య మృతికి కారణమైన భర్తకి 10 సంవత్సరాల జైలు శిక్ష

**నల్గొండ అర్బీ, జూలై 22, తరంగాలు :**
నల్గొండ జిల్లా కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో 2015 సంవత్సరంలో నమోదైన వరకట్న వేధింపులు, మరణానికి సంబంధించిన కేసులో నిందితుడికి నల్గొండ మహిళా కోర్టు కమ్ 4 అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి కఠిన కారాగార శిక్ష విధించారు.కట్టంగూర్ పోలీస్ స్టేషన్ లో నమోదు చేసిన వరకట్న నిషేధ చట్టం సెక్షన్ 3, 4 కింద నమోదు చేసిన కేసును విచారించిన న్యాయస్థానం, నిందితుడు సురారపు సైదులు వయస్సు 25 సంవత్సరాలు నివాసం యర్రసానిగూడెం గ్రామం, కట్టంగూర్ మండలం, దోషిగా నిర్ధారించింది.విచారణ అనంతరం నిందితుడికి ఐపీసీ సెక్షన్ 304(బి ) కింద 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష (రిగూరస్ ఇంపరిసన్మెంట్ ) విధించింది. అదేవిధంగా వరకట్న నిషేధ చట్టం సెక్షన్ 4 కింద 6 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.కోర్టు విధించిన రెండు శిక్షలు ఏకకాలంలో (కాంకరెంటు ) అమలులో ఉండనున్నాయి.ఈ కేసు దర్యాప్తును అప్పటి దర్యాప్తు అధికారులు ఎం. విజయ ప్రకాష్, ఎస్ఐ, కట్టంగూర్, బి. రాములు నాయక్, ఎస్‌డీపీఓ, నల్గొండ మరియు ఎస్. సుధాకర్, ఎస్‌డీపీఓ, నల్గొండ సమర్థవంతంగా నిర్వహించారు. కోర్టులో ప్రభుత్వ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి ఆర్. అఖిల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి శ్రీవాణి దామోదరం మరియు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకట రమణా రెడ్డి వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ, మహిళలపై జరిగే వేధింపులు, వరకట్న వేధింపులు, గృహ హింస వంటి నేరాల పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని తెలిపారు. మహిళల భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అలాగే కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజన్ అధికారులు మరియు ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించారు.

## కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో 26 వ తేదీన రైల్వే స్టేషన్ ప్రారంభం

- కోరుకొప్పుల నాగేష్ గౌడ్
- బిజెపి మండల అధ్యక్షులు



జఫర్గడ్ ప్రతినిధి, జులై22,(తరంగాలు): బిజెపి జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ సూచన మేరకు కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనం కోసం సంవత్సర కాలంలో దేశం నలుమూలలనుండి దాదాపు 25 లక్షల మంది కొమురవెల్లి కి వస్తున్నారు వారికి ప్రయాణ సమయం తగ్గించి తక్కువ ఖర్చులో దేవస్థానం చేరుకునే విధంగా ఈ నెల 26 వ తేదీన కొమురవెల్లి పుణ్యక్షేత్రం లో కేంద్ర మంత్రి వర్యులు కిషన్ రెడ్డి చేతుల మీదుగా రైల్వే స్టేషన్ ప్రారంభించటం జరుగుతుంది. ంకావున ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగం కావాలి అని జిల్లా పార్టీ పిలుపు లొ బాగంగా జాఫర్ ఘడ్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుళ్ళ మోహన్ రావుకి, ఉపసర్పంచ్ కొత్వాల్ కుమార్కి కిషన్ రెడ్డి తరుపున ఆహ్వాన పత్రిక అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగరాపు రమేష్, ధార్మిక సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ ఎదులపురం మదన్, మన్ కి బాత్ మండల కన్వీనర్ గిరగొని యాదగిరి గౌడ్, బూత్ అధ్యక్షులు చావనబోయిన శ్రీనివాస్, మెటుక ప్రేమ్, అన్నెబోయిన సంతోష్, కుంభం చంద్రమౌళి,కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రప్రభా అలంకారంలో అమ్మవారు







- శ్రీ భద్రకాళీ ఆలయంలో వైభవంగా శాకంభరీ నవరాత్రి ఉత్సవాలు
- ఎనిమిదో రోజు ఉగ్రప్రభా, త్వరితామాత అలంకారంలో భక్తులకు అమ్మవారి దర్శనం

**వరంగల్ ప్రతినిధి , జూలై 22, తరంగాలు :** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జరుగుతున్న శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తిచేసిన అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను కాళీ క్రమానుసారం ఉగ్రప్రభా స్వరూపంలో, షోడశీ క్రమానుసారం త్వరితామాత స్వరూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ, ఉగ్రప్రభా మాతను ప్రత్యంగిరా దేవిగా కూడా పిలుస్తారని తెలిపారు. ఈ అమ్మవారి అనుగ్రహంతో ప్రకృతి, ప్రాణికోటికి హాని కలిగించే దుష్టశక్తులు నశిస్తాయని, పాడిపంటలకు కీడు తలపెట్టే అసురశక్తులను సంహరించే దివ్యశక్తి ఉగ్రప్రభా మాతకు ఉందని వివరించారు.అలాగే జన్మజన్మాంతరాల పాపాల వల్ల కలిగే బాధలను తొలగించి, భూతప్రేత పీడలు, దుష్టశక్తుల నుంచి భక్తులను కాపాడి, సకల విధాల అభయాన్ని ప్రసాదిస్తూ కోరిన కోరికలను నెరవేర్చే కరుణామయి స్వరూపమే ఉగ్రప్రభా మాత అని పేర్కొన్నారు.శాకంభరీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారు వివిధ దివ్య అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తూ విశేష పూజలు అందుకుంటుండగా, పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారని కార్యనిర్వహణ అధికారి రామల సునీత తెలిపారు.

## ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, తరంగాలు న్యూస్ జూలై 22:**
జిల్లాలోని ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవలు, స్వచ్ఛమైన తాగునీరు, పోషకాహారం, క్రీడా వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అన్ని పాఠశాలల్లో సికిల్ సెల్, వార్షిక ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు పార్ట్‌టైమ్ వైద్యులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్ఓ వాటర్ కూలర్లు, హైస్పీడ్ ఇంటర్నెట్, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, అంతర్గత రహదారులు, తల్లిదండ్రుల కోసం వేచి ఉండే షెడ్లు వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని, అవసరమైన చోట చపాతీ తయారీ యంత్రాలు ఏర్పాటు చేయాలని, పాఠశాలల పరిశుభ్రత, పచ్చదనం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు ఏకలవ్య పాఠశాలలు ఆదర్శంగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు.

## అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అడ్డం కాదు: బీఆర్ఎస్ నేతలు, కౌన్సిలర్లు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జూలై.22,తరంగాలు**:అమరవీరుల స్తూపం నుండి ఉప్పరపల్లి చెరువు వరకు వెళ్లే వరద కాలువ మరమ్మతు పనులను ఎలాంటి అవాంతరాలు లేకుండా, వరద నీరు సక్రమంగా చెరువులో చేరేలా అధికారులు పూర్తిస్థాయిలో చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మరియు మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన వారు,అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వెన్నంటే ఉంటుందని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే ప్రయత్నాలను ఏ పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని స్పష్టం చేశారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువపై అక్రమ నిర్మాణాలు ఉంటే తొలగించాలని, ఒకవేళ అవి పట్టా భూమిలో ఉంటే మాత్రం యజమానులకు ఎలాంటి నష్టం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అక్రమ నిర్మాణాల తొలగింపు విషయంలో ముందుగా పెద్దలు, ధనవంతులపై చర్యలు తీసుకున్న తర్వాతే, నిబంధనల ప్రకారం ఇతరులపై చర్యలు చేపట్టాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.?బాధితులకు న్యాయం: తొలగింపుల వల్ల నిర్వాసితులైన బాధితులకు ఎలాంటి ఫీజులు లేకుండా జీరో ఫీజుతో అనుమతులు మంజూరు చేయాలి.ఇందిరమ్మ ఇళ్లు:నిరాశ్రయులైన బాధితులకు వెంటనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి.అధికారులకు హెచ్చరిక: ఈ డిమాండ్లు నెరవేర్చకపోతే బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ఉద్యమించి పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు.?ఈ సమావేశంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ నజీర్ అహ్మద్, కేసముద్రం మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ పార్టీ మాజీ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింగం వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు,రావుల వినయ్ రెడ్డి, పా యిరాల శరత్ యాదవ్,ఆగే రాము, మేకల సురేష్, దేవేందర్, రజిత రాజ్ కుమార్, సుధాకర్,నజ్జు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ఘనంగా దాశరథి కృష్ణమాచార్యుల జయంతి

- దాశరథి సాహిత్య సేవలు చిరస్మరణీయం: పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై.22, తరంగాలు**:కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో బుధవారం ప్రముఖ కవి, తెలంగాణ మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తన కవితలు, కావ్యాల ద్వారా సామాజిక




చైతన్యాన్ని పెంపొందించడంలో దాశరథి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యాభ్యాసంతో పాటు సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాశరథి రచనలు, సాహిత్య విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 23 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికి విరుద్ధం







**• కాంగ్రెస్ నేతల తీరును ఖండించిన రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ,బీజేపీ ఎమ్మెల్యేలు**

**హైదరాబాద్, జూలై 22, తరంగాలు ప్రతినిధి** : బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూండాల తరహాలో వ్యవహరిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై రాళ్లతో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో ఓ విలేకరి తలకు తీవ్ర గాయాలయ్యాయని, వెంటనే బీజేపీ కార్యాలయ సిబ్బంది ఆయనను సమీపంలోని కేర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విభేదాలను హింసాత్మక చర్యల ద్వారా వ్యక్తం చేయడం సమంజసం కాదని పేర్కొన్న వారు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాంగ్రెస్ నాయకులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. అసాంఘిక శక్తులతో కలిసి ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్, రాష్ట్ర టీచర్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## .అడప మహేష్ కుటుంబానికి మంత్రి కొండా సురేఖ,ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ

**•నిందితులకు కఠిన శిక్ష తప్పదని స్పష్టం**



వర్ధన్నపేట ప్రతినిధి , జూలై 22, తరంగాలు : వర్ధన్నపేట నియోజకవర్గం 14వ డివిజన్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి అడప మహేష్ ఇటీవల జరిగిన పెట్రోల్ దాడిలో మృతి చెందడంతో, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బుధవారం ఎన్టీఆర్ నగర్‌లోని మహేష్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మహేష్ కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందిన మహేష్ మరణం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్టు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కేసముద్రం మండలంలో తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నా శివారెడ్డి పర్యటన



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జులై. 22, తరంగాలు**:తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యురాలు శ్రీమతి జ్యోత్స్నా శివారెడ్డి బుధవారం కేసముద్రం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కేసముద్రం విలేజ్, కల్వల, ఉప్పరపల్లి, కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరియు బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, కేసముద్రంలను సందర్శించి, పాఠశాలల మౌలిక వసతులు, తాగునీరు, డిజిటల్ విద్యా సదుపాయాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలల అవసరాలు, ఎదురవుతున్న సమస్యలు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం ఆధారంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థ రూపకల్పనకు అవసరమైన సూచనలను కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ఏ.సత్యనారాయణ మూర్తి మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి ఆమె వెంట ఉన్నారు.




# పోలీసు నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోలేరు









**•గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నిరసన**
**• డాక్టర్ వన్నాల వెంకట రమణ అరెస్ట్**
**•కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, జూలై 22, తరంగాలు** :పోలీసు నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు.తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం (గాంధీభవన్) వరకు చేపట్టిన నిరసన (గెరావ్) కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు.నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు డాక్టర్ వన్నాల వెంకట రమణతో పాటు పలువురు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకట రమణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. ఒకవైపు ఢిల్లీలో నిరసనల పేరుతో విధ్వంసక చర్యలకు పాల్పడుతూ, మరోవైపు తెలంగాణలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులను పోలీసులు అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.పోలీసు నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో బీజేపీ నాయకులను, కార్యకర్తలను భయపెట్టలేరని, కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక, అరాచక విధానాలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, డా. పాల్వాయి హరీష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవ లక్ష్మి నర్సయ్య, అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్తో పాటు రాష్ట్ర బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దేశ విద్యావ్యవస్థలోని సమస్యల పరిష్కారం కోసమే ఛత్రోంకీ గూంజ్ కార్యక్రమం






**వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు**

**హన్మకొండ ప్రతినిధి, జులై 22,తరంగాలు** : దేశ విద్యావ్యవస్థలోని సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఛత్రోం కీ గూంజ్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపట్టిందని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.బుధవారం హన్మకొండలోని ఇందిరానగర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో,కిషన్ పురలో ఏర్పాటు చేసిన ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమానికి తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ...నీట్ ప్రశ్న పత్రం లీక్ అంశంలో కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. గత 12 ఏళ్లుగా విద్యారంగంలో ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, భావజాల ఆధిపత్యానికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ విమర్శించారు.దేశంలో ప్రస్తుతం నిరుద్యోగ సమస్యతో పాటు యువతలో ఉపాధి సామర్థ్య లోపం కూడా తీవ్రమైందని అన్నారు.భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని,విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం దాడులు చేస్తుందని మండిపడ్డారు.విద్యార్థుల వారి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.విద్యార్థుల లోకం తలుచుకుంటే ఏ విధంగా ఉంటుందో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఆయుబ్,యూత్ కాంగ్రెస్ నాయకులు,జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,నాయకులు,విద్యార్థులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ బొగ్గు బెల్ట్‌లో సీబీఎం నిల్వల అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలి

- కేంద్రాన్ని కోరిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- లోక్‌సభలో రూల్--377 కింద అంశాన్ని ప్రస్తావించిన వరంగల్ ఎంపీ



**న్యూఢిల్లి, జులై 22,తరంగాలు** : తెలంగాణలోని సింగరేణి బొగ్గు క్షేత్రాలు, ములుగు--భూపాలపల్లి ప్రాంతాల్లో ఉన్న కోల్ బెడ్ మీథేన్ (సీబీఎం) నిల్వల అన్వేషణ, అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కోరారు. బుధవారం రూల్--377 కింద ప్రత్యేక అంశాన్ని ప్రస్తావిస్తూ ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.తెలంగాణ బొగ్గు బెల్ట్‌లో గణనీయమైన స్థాయిలో సీబీఎం నిల్వలు ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని ఎంపీ తెలిపారు. సీబీఎం పరిశుభ్రమైన ఇంధన వనరుగా దేశ ఇంధన భద్రతకు తోడ్పడటంతో పాటు విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భూగర్భ బొగ్గు గనుల్లో మీథేన్ వాయువు నిల్వలను తగ్గించడం ద్వారా గనుల భద్రత మెరుగుపడుతుందని, ప్రమాదాల అవకాశాలు కూడా తగ్గుతాయని చెప్పారు.సీబీఎం వనరుల శాస్త్రీయ అన్వేషణ, వాణిజ్యపరమైన వినియోగం ద్వారా తెలంగాణలోని బొగ్గు గని ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. అయితే గణనీయమైన నిల్వలు ఉన్నప్పటికీ, వాటి అన్వేషణ, అభివృద్ధి ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బొగ్గు బెల్ట్‌లో సీబీఎం నిల్వలపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని, అన్వేషణ ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే తగిన విధానపరమైన మద్దతు, పెట్టుబడులతో సీబీఎం బ్లాకుల కేటాయింపు, అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. సీబీఎం వెలికితీత, వినియోగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# వరంగల్‌లో ఎన్ఎఫ్ఎస్ఏ అమలుపై పార్లమెంట్‌లో డా. కడియం కావ్య ప్రశ్న



**న్యూఢిల్లి, జులై 22,తరంగాలు** : తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం ( ఎన్ ఎఫ్ ఎస్ ఏ ) అమలుపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్లో ప్రశ్నించారు. జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారో, అలాగే ఆహార ధాన్యాల కేటాయింపు మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఎంపీ డా.కడియం కావ్య వివరాలు కోరారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతీభాయ్ బంభానియా లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 4,51,376 మంది లబ్ధిదారులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఉచిత ఆహార ధాన్యాలు పొందుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు గుర్తించిన లబ్ధిదారుల ఆధారంగా కేంద్రం నిర్దేశించిన పరిమితుల మేరకు ఆహార ధాన్యాల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద ప్రతి కుటుంబానికి నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలు, ప్రాధాన్య కుటుంబాల (పీహెచ్‌హెచ్) కింద ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలు అందిస్తున్నట్లు వివరించారు.ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల ఆహార భద్రత అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలనేదే తన లక్ష్యం అన్నారు. ఆహార ధాన్యాల కేటాయింపులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగితే తగిన విధంగా కేటాయింపులు పెంచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

# 56 కోట్ల విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం





- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హనుమకొండ ప్రతినిధి , జూలై 22, తరంగాలు** : రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండలో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు కలిసి పలు విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు నిర్వహించారు.అనంతరం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. విద్యుత్ సేవల విస్తరణ, మౌలిక వసతుల బలోపేతం, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.తదనంతరం ములుగు రోడ్డులో నూతనంగా నిర్మించనున్న స్పోర్ట్స్ భవనం, నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ భవనాలకు శంకుస్థాపన చేసి మొక్కలు నాటారు. అలాగే వరంగల్ కలెక్టరేట్ కాంప్లెక్స్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, కేఎంసీ విద్యుత్ ఉపకేంద్రం, పోచమ్మ మైదాన్ విద్యుత్ ఉపకేంద్రం, ఇంటర్‌లింకింగ్ లైన్‌లను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల ద్వారా వరంగల్ ప్రాంతంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.




# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
- నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంట్ ముందు విపక్షాల ఆందోళన
- విద్యార్థులపై పోలీసుల దాడి నిరసిస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నిరసన

**న్యూఢిల్లీ, జులై 22,తరంగాలు** : నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు.ఈ సందర్భంగా నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను సహించబోము అన్నారు. పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని పేర్కొన్నారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.




# ఐనవోలు వడ్డెర సంఘం మండల అధ్యక్షుడిగా ఓర్సు రాజకుమార్



**ఐనవోలు, జులై 22,తరంగాలు** : అయినవోలు మండల వడ్డెర సంఘం నూతన మండల అధ్యక్షుడిగా ఓర్సు రాజకుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపు శివ కుమార్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఓర్సు రాజకుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, మండల సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు కులస్థుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ ఐక్యతే అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు.కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ సలహాదారు పల్లెపు సమ్మయ్య, రాష్ట్ర నాయకులు పల్లెపు కడిపికొండ కుమారస్వామి తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడు ఓర్సు రాజకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మండల వ్యాప్తంగా వడ్డెర సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ఎనగందుల పుష్పలీలకు కాంగ్రెస్ నాయకుల నివాళి





**రాయపర్తి, జూలై 22,తరంగాలు:** పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశశ్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,కొండాపురం సర్పంచ్ కనుకుంట్ల మంజుల--అశోక్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ సర్పంచ్ ఎనగందుల మురళి సతీమణి ఎనగందుల పుష్పలీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మాజీ సర్పంచ్ ఎనగందుల మురళి సతీమణి ఎనగందుల పుష్పలీల ఇటీవల మృతి చెందగా, బుధవారం రాయపర్తి మండలం కొండాపురం గ్రామంలో ఆమె దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు.

సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఎనగందుల మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పుష్పలీల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, కొండాపురం సర్పంచ్ కనుకుంట్ల మంజుల--అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు

●ఆక్రమిత సాగునీటి కాలువ పరిశీలన.. ప్రహరీ నిర్మాణ పనులకు తాత్కాలిక బ్రేక్



**వర్ధన్నపేట ప్రతినిధి, జూలై 22,తరంగాలు:**వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారులోని ఊర చెరువు ఆయకట్టు పరిధిలో ఉన్న సాగునీటి కాలువను ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారనే రైతుల ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. పరిశీలన అనంతరం కాలువ ప్రాంతంలో కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయించారు.గ్రామ శివారులోని సుమారు ఎనిమిది పిట్ల వెడల్పు గల సాగునీటి కాలువను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని రైతులు వర్ధన్నపేట మండల తహసీల్దార్ విజయ్ సాగర్ కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, ఆర్ ఐ , జీపీఓ,ఇల్లంద గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు.విచారణ సందర్భంగా కాలువపై నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే ప్రహరీ నిర్మాణాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కాలువ ఆక్రమణ వల్ల చెరువు నీరు వ్యవసాయ భూములకు సక్రమంగా చేరడం లేదని, దీంతో సాగు తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుని, కాలువను యథావిధిగా పునరుద్ధరించి సాగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని అధికారులను కోరారు.సాగునీటి కాలువలు రైతుల జీవనాధారమని, వాటి పరిరక్షణకు అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలపై పోరాటం రాహుల్ గాంధీ కుటుంబానికి కొత్త కాదు





●వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయూబ్

**రాయపర్తి, జూలై 22,తరంగాలు** : ప్రజా సమస్యలపై పోరాటం రాహుల్ గాంధీ కుటుంబానికి కొత్త కాదు అని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయూబ్ అన్నారు.నీట్ పేపర్ లీకేజ్ పై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాయపర్తి కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి,ఎంమ్మెల్సీ బసవరాజు సారయ్య పాల్గొన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారఅనంతరం ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.నీట్ కుంభకోణం కారణంగా 21 మంది విద్యార్థులు మరణించిన ఘటనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని జవాబుదారీగా చేయాలని డిమాండ్ చేశారు.దేశ యువత భవిష్యత్తు కోసం,విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారు.లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని ఆపలేరు అన్నారు.కాంగ్రెస్ పార్టీ మరియు ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని,విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మరియు రాయపర్తి మండల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

●విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ

●నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన

న్యూఢిల్లీ,జులై22 వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు.




## చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం

### అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

న్యూఢిల్లీ,జులై22 కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

## బాసర ఆలయంలో వరుణయాగం

బాసర,జూలై22 చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం వరుణయాగం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురియక పోవడంతో వరుణ యాగం చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో వరుణయాగాన్ని మంగళ వాయిద్యాలతో బాలలయం నుండి వైదికశాల ప్రవేశం అనంతరం గురు ప్రార్థన, వరుణయాగ సంకల్పం, గణపతి పూజ, పుణ్యహవాచణం, నాంది ముఖం, నవగ్రహ మండప వరుణ కళశస్థాపన, అగ్ని ప్రతిష్ట, వరుణ జపములు స్థాపిత దేవతా పూజ హోమములు, నిర్వహించారు. ఆలయ ఈఓ అంజని దేవి మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పాడి పంటలు పండి రాష్ట్ర,దేశ ప్రజలు అందరూ ఆనందంగా ఉండాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈవో గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ లు శివరాజ్, సంజీవ రావు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీక్‌పై రాజకీయాలు తగవు

న్యూఢిల్లీ,జూలై22 నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటు వేదికగా లోతైన చర్చకు తాము సిద్ధమేనని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశం, విద్యార్థుల నిరసనలతో రాజకీయాలు వద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని అన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం









**వరంగల్ ప్రతినిధి, జులై 22,తరంగాలు :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ పర్యటన నిమిత్తం వరంగల్ ఎన్ఐటి గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు బుధవారం ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలకు ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, వరంగల్, హనుమకొండ, జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద,చాహత్ బాజ్ పాయి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, తదితరులు పుష్ప గుచ్ఛాలు, పూలమొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు.ఎన్ఐటీ గెస్ట్ హౌజ్ కు చేరుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొద్దిసేపు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలతో సమావేశమయ్యారు.



## వడ్డెర కులానికి న్యాయం చేయాలి: జిల్లా అధ్యక్షుడు గండికోట సంపత్



**ఐనవోలు, జులై 22,తరంగాలు : అయినవోలు మండల కేంద్రంలో వడ్డెర** కుల సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గండికోట సంపత్ మాట్లాడుతూ, సమాజంలో వడ్డెర కులానికి తగిన గుర్తింపు లభించడం లేదని, ప్రభుత్వ పరంగా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.వడ్డెర కులస్థులకు సామాజికంగా, రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు, వారి హక్కులను పరిరక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్డెర ఉపాధి కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వడ్డెర కులానికి పూర్తి ప్రభుత్వ గుర్తింపు, ఆర్థిక చేయూత అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని, ప్రతి ఒక్కరూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్ మార్పుపై విమర్శలు

**టీమిండియాపై మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ ఆగ్రహం**

లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానం లో బ్యాటింగ్‌కు పంపడంపై భారత మాజీ కెప్టెన్ క్రిస్ శ్రీకాంత్ అసహనం వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో 388 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-2తో కోల్పోయింది. తన యూ ట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. రాహుల్ బ్యాటింగ్ స్థానాన్ని మార్చడంపై ప్రశ్నలు లేవనెత్తారు. "అంత భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఎవరైనా కేఎల్ రాహుల్‌ను నంబర్ 6 స్థానంలో పంపుతారా? క్లిష్టమైన పరిస్థితుల్లో లక్ష్య ఛేదనలో అతడు జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు కదా. రాహుల్ నంబర్ 6 లేదా 7 స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడా? ఇది చాలా అన్యాయం. అతడి బాడీ లాంగ్వేజ్ కూడా ఏదో ఆందోళనలో ఉన్నట్లుగా అనిపించింది" అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీల విషయంలో ఎలాగైతే తప్పులు చేశారో ఇప్పుడు కేఎల్ రాహుల్ విషయంలోనూ అలాగే చేస్తున్నారు. ఒకవేళ లార్డ్స్ వన్డేలో కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే 2023 ప్రపంచకప్ మాదిరిగా విరాట్ కోహ్లీకి తోడుగా నిలిచేవాడు. రాహుల్ వేగంగా పరుగులు రాబడతాడు. కానీ, మ్యాచ్ దాదాపు ముగిసిపోయిన తర్వాత అతడిని బ్యాటింగ్‌కు పంపారు. ఓవర్‌కు 15 పరుగులు అవసరమైనప్పుడు అక్షర్ పటేల్‌తో కలిసి రాహుల్ మ్యాచ్‌ను గెలిపిస్తాడా?" అని శ్రీకాంత్ ప్రశ్నించారు. కాగా భారత్ స్కోరు 304/4 వద్ద ఉన్నప్పుడు రాహుల్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అప్పటికి ఓవర్‌కు దాదాపు 15 పరుగులు అవసరమయ్యాయి. ఈ సమయంలో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో రాహుల్ ఔట్ అయ్యాడు. 12 బంతుల్లో 8 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఈ వన్డే సిరీస్‌లో రాహుల్ కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. తొలి వన్డేలో ఒక పరుగు చేసిన అతడు, లార్డ్స్‌లో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 12 పరుగులు చేశారు. గాయం కారణంగా రెండో వన్డేకు దూరమయ్యాడు.

## రంభ ఊర్వశి మేనక నుంచి సాంగ్ విడుదల

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక'. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.

## ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి

స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.